ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం ఉమ్మడి జిల్లాలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ఈసందర్భంగా కిక్కిరిశాయి. జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆలయాలను సందర్శించారు. ఉత్తర ద్వార దర్శనానాకి భక్తులు ఉదయం నుంచే ఆలయాల్లో దర్శనం కోసం క్యూ కట్టారు.కదిరిలోని శ్రీఖాద్రీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారుఈ సందర్భంగా ఆలయాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, నిర్వాహకులు తగిన ఏర్పాట్లను చేశారు.

కదిరిలో ఖాద్రీశుడి దర్శనానికి బారులుదీరిన ప్రజలు

వైసిపి
బీసీ నేతల్లో అలజడి..!

పార్టీలో ప్రాబల్యం తగ్గించాలన్న ఒసి నేత..
అసంతృప్తిలో బిసి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపిలో బిసి నేతల అలజడి నెలకొంది. పార్టీలో బిసిల ప్రాధాన్యత తగ్గించాలంటూ ఒక నేత వ్యాఖ్యలతో ఈ అలజడి నెలకొన్నట్టు తెలుస్తోంది. వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నా బిసి.. నా ఎస్సీ...ఎస్సీ అనడమే కాకుండా అధికారంలో ఉన్న సమయంలో వారికి తగిన ప్రాధాన్యతను కల్పించారు. వారికి లభించిన ప్రాధాన్యతను చూసి ఒసి నేతలు కొందరికీ అసంతృప్తి నెలకొంది. వారి ప్రాధాన్యతను తగ్గించే యోచన చేస్తున్నట్టు బిసి నేతల్లో బలమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్న సమయంలోనూ ఇదే తీరున జిల్లాలో నడిచిందని చెబుతున్నారు. ఇప్పుడు పార్టీ అధికారంలో లేకపోయినా బిసిలను వెనక్కు నెట్టే ప్రయత్నాలను కొంత మంది నేతలు చేస్తున్నారన్న అసంతృప్తి వైసిపి బిసి నేతల్లో వ్యక్తమవుతోంది. పార్లమెంటు స్థాయి నేతకు ఇటీవల రాష్ట్ర స్థాయి పార్టీ పదవి లభించింది. ఆయనకు లభించిన ఈ ప్రాధాన్యత ఒసి నేత ఒకరికి నచ్చనట్టు తెలుస్తోంది. ఆయనకు ఎందుకు అంతటి ప్రాధాన్యతనిస్తున్నారు... తగ్గించాలన్నట్టు చేసిన వ్యాఖ్యలు బిసి నేతలను అసంతృప్తికి గురిచేశాయి. మరికొంత మంది నేతలు కూడా బిసి నేతల ప్రాధాన్యత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బిసి నేతలంతా ఇటీవల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి శంకర నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తోపాటు మరికొంత మంది నాయకులు పాల్గొన్నట్టు సమాచారం. గతంలో అధికారంలోనున్న సమయంలో ఒకరిద్దరు నాయకులు బిసి నేతల పట్ల ఇదే తీరుతో వ్యవహరించారని చర్చించనట్టు తెలుస్తోంది. శంకర నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో పెనుకొండ నియోజకవర్గానికి చెందిన ఒక ఒసి నాయకుడు ఒక ఎమ్మెల్యేతో మాట్లాడిన మాటలు అప్పట్లో పెద్ద చర్చకే దారితీశాయి. బిసి నేతలు బయట నుంచి వచ్చిన బాడుగ ఇంట్లోకి వచ్చిన వారని వ్యాఖ్యానించారు. వారు ఎప్పుడైనా బయటకు పోక తప్పదని కూడా మాట్లాడారు. ఇప్పుడు కూడా ఆ నేత ఇదే పద్ధతిలో మాట్లాడినట్టు బిసి నేతలు అసంతృప్తితో ఉన్నారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తే వారికి తగిన ప్రాధాన్యత కల్పించకపోవడంపై బిసి నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇస్తున్నా స్థానికంగా కొంత మంది నేతలు దాన్ని అణచివేసే ప్రయత్నం చేయడాన్ని ఏ రకంగా ఎదుర్కొనాలని ఈ సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. దీన్ని అధిష్టానం దృష్టికి కూడా తీసుకెళ్లాలన్న ఆలోచన చేసినట్టు కూడా తెలుస్తోంది. ఏది ఏమైనా అధికారాన్ని కోల్పోయిన సమయంలో అందరినీ కలుపుకుని ముందుకుపోవాల్సింది పోయి ఈ రకంగా సామాజిక తరగతి వారీగా ప్రాధాన్యతలపై కుంపట్లు పెట్టుకోవడం ఆ పార్టీ శ్రేణుల్లోనూ గుబులు రేపుతోంది.

దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడటంలో
భారతీయ రెవెన్యూ సర్వీస్ అధికారుల పాత్ర కీలకం

కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి
అట్టహాసంగా 74వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్

గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్రమంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాటంలో భారతీయ రెవెన్యూ సర్వీస్(కస్టమ్స్,పరోక్ష పన్నులు) అధికారుల పాత్ర కీలకమైనదని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్‌చౌదరి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గోరంట్ల సమీపంలోని పాలసముద్రం వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసెన్)లో శిక్షణ పొందిన భారతీయ రెవెన్యూ సర్వీస్ (కస్టమ్స్, పరోక్ష పన్నులు) అధికారుల 74వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ బ్యాచ్‌లో 25 మంది పురుష అధికారులు, 10 మంది మహిళా అధికారులతో సహా మొత్తం 35 మంది అధికారులు ఉన్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ పరేడ్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి) ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ , సిబిఐసి బోర్డు మెంబర్లు శశాంక్ ప్రియ, యోగేంద్ర గార్గే, నా సిన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగొంగ్డిన్ పన్మయి, సిబిఐసి సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో భారత ఆర్థిక వ్యవస్థను పరిరక్షించడంలో కీలక బాధ్యతలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్న అధికారులను అభినందించారు. ఆర్థిక పురోగతి, సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ విజన్ వికసిత్ భారత్‌ను ముందుకు తీసుకెళ్లగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. సిబిఐసి ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, అధికారులు తమ విధుల్లో నిర్ణయాత్మకత, వినూత్నతతో పాటు అభిప్రాయాలను, సూచనలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. దేశ పన్ను, వాణిజ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాలన్నారు. నాశన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగొంగ్డిన్ పన్మయి మాట్లాడుతూ శిక్షణ పొందిన అధికారులు దేశవ్యాప్తంగా తమ విభిన్న పాత్రల్లో అత్యున్నత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 74వ బ్యాచ్‌కు చెందిన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు అందజేసి సత్కరించారు.విద్యా విషయాలు, హాజరు, శారీరక శిక్షణలో సమతుల్యత కనబరిచినందుకు కె. ప్రసాద్ కృష్ణన్‌కు ఆర్థిక మంత్రి బంగారు పతకం లభించింది. రాత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు సాహిల్ ఖరేకు ఛైర్మన్ బంగారు పతకం లభించింది. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన మహిళా అధికారి ముసలే అనుజా అనంత్‌కు కౌశల్య నారాయణన్ స్మారక బంగారు పతకం లభించింది. శిక్షణ అంతటా స్థిరమైన పనితీరు, అద్భుతమైన ప్రవర్తన కనబరిచినందుకు పంకజ్ గుజర్‌కు ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ బంగారు పతకం లభించింది. ఆదర్శవంతమైన క్రమశిక్షణ, ప్రవర్తన, సమిష్టి కృషి కనబరిచినందుకు వినీత్ బన్సోడ్‌కు ఎన్.కె. ఉపాధ్యాయ్ స్మారక బంగారు పతకం లభించింది. ఈ పరేడ్‌లో అధికారులు ప్రదర్శించిన కవాతులు వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణను చాటిచెప్పాయి. దేశ ఆర్థిక వ్యవస్థను పెంపొందించే వారిగా దేశ రక్షకులుగా తమ పాత్రలను స్వీకరిస్తూ, సమగ్రత సేవ యొక్క విలువలను కాపాడతామని శిక్షణ పొందిన అధికారులు ఈసందర్భంగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్, ఎస్పీ రత్న, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి: లేపాక్షిలోనిశ్రీ వీరభద్ర స్వామి దేవాలయాన్ని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ విశిష్టతను అర్చకులు మంత్రికి తెలియజేసారు. దేవాదాయ కార్యనిర్వహణాధికారి .నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో కేంద్రమంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్, తహశీల్దారు సౌజన్య లక్ష్మి, హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

శ్రీశైలం జలాశయంలోని నీటిని అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్యుత్ ఉత్పత్తి పేరుతో పూర్తిగా తోడేస్తున్నాయని, శ్రీశైలం నీటిని కాపాడి రాయసీమ రైతులను రక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది శ్రీశైలం జలాశయానికి 1,622 టిఎంసీల వరద నీరు వచ్చినా హంద్రీనీవా కింద సాగైన పంటలు పూర్తయ్యేవరకు నీరు వచ్చే పరిస్థితి కన్పించలేదన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి తక్షణం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. శ్రీశైలం డ్యాంలోకి వచ్చిన నీటిని ఇప్పటికే తెలంగాణ 358.84 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 199.38 టీఎంసీలు విద్యుత్ పేరుతో కిందకు వదిలేశాయన్నారు. ప్రస్తుతం డ్యాంలో 105 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. ఈ కొద్దిపాటి నీటితో హంద్రీనీవా కాలువ కింద సాగైన పంటలు పూర్తయ్యేవరకు వచ్చే అవకాశం లేదన్నారు. గత సంవత్సరం వర్షాభావం వల్ల పంటలు చేతికివచ్చే సమయంలో నీరు లేక అనంతపురం, కర్నూలు జిల్లాల రైతులు కోట్ల రూపాయలు నష్టపోయారన్నారు. మూడు నాలుగు సంవత్సరాలకు ఒకసారి కర్నాటకలో వచ్చే వరదలవల్ల శ్రీశైలం డ్యాంకు వరదనీరు చేరుతుందని వరదలు వచ్చినప్పుడు అదనపు నీటిని రాయలసీమ జిల్లాలకు తరలించడానికి ప్రస్తుతం వున్న హంద్రీనీవా కాలువ 354 క్యూసెక్కుల సైజ్ సరిపోదని అన్నారు. ఈ కాలువను కనీసం 6400 క్యూసెక్కుల సైజ్‌లో వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. కాలువ వెడల్పుకు గత ప్రభుత్వం జీవో ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. పదివేల క్యూసెక్కుల సైజ్‌తో కాలువ వెడల్పు చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం శ్రీశైలంలో వున్న నీటిని తెలంగాణ ప్రభుత్వం తోడేస్తుంటే అడ్డుకోవలసిందిపోయి పోటీపడి శ్రీశైల జలశయాన్ని ఖాళీ చేయిస్తుందని విమర్శించారు. హంద్రీనీవా కాలువ కింద సాగుచేసిన మిరప, పత్తి తదితర పంటలు పూర్తయ్యేవరకు నీరు వదిలేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాలువ వెడల్పు కోసం, ప్రస్తుత పంటల రక్షణ కోసం హంద్రీనీవా సాగుదార్లతో ఈ నెల 19న కర్నూలులో సదస్సు, 27న అనంతపురం, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు రాంభూపాల్ తెలిపారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

సమావేశంలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయత గల సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం "సైన్సు-చెకుముకి ఉపాధ్యాయ మిత్రులతో సమాలోచన" అనే అంశంపై అనంతపురం నగరం, రూరల్ ప్రాంతం పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులతో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు తర్వాత అంతస్థాయిలో ఎక్కువ మంది విద్యార్థులతో పరీక్షలు నిర్వహించేది జన విజ్ఞాన వేదిక అని అన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా విద్యార్థులు చెకుముకి సంబరాలు పేరుతో జెవివి నిర్వహించే టాలెంట్ టెస్ట్ లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రపంచ దేశాలు సైన్స్‌ని అభివృద్ధి చేస్తూ అద్భుత ఫలితాలను అందుకుంటున్నాయని మనదేశంలో అలాంటి ప్రయత్నం జరగకపోగా ప్రజలను మరింతగా అశాస్త్రీయ భావాలవైపు మరలేలా పాలకులు మార్చేస్తున్నారని విమర్శించారు. శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణం కోసం గత 30 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని అది మరింతగా అభివృద్ధి చెందడానికి అందరి సహకారం అవసరమని కోరారు. సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు సైన్సు కు సంబంధించిన అనేక అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేశారు.గౌరవ అధ్యక్షులు గాంగే నాయక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కోశాధికారి జిలాన్‌బాషా, జిల్లా సమత కన్వీనర్ డాక్టర్ పి.ప్రసూన,యుటిఎఫ్ నాయకులు సురేష్, జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, నాయకులు ప్రసాద్, లక్ష్మీనారాయణ ప్రసాద్ రెడ్డి, రామకృష్ణ, తిరుపాలు, ముత్యాలు పాల్గొన్నారు

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

సంక్రాంతికి చంద్రన్న కానుక ఇవ్వాలి
తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో సిపిఎం

అధికారులకు సమస్యలను వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అర్హులైన పేదలందరికీ రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయాలని, ఇచ్చిన హామీ మేరకు సంక్రాంతి కానుక ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముత్తుజ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఎం నగర కార్యదర్శి వి. రామిరెడ్డి మాట్లాడుతూ అనంతపురం నగరంలో సుమారు 130 పైగా ప్రభుత్వ స్టోర్లు ఉన్నాయని, ఇవి ఎప్పుడు తెరుస్తారో ఎప్పుడు మూస్తారో, ఎన్ని గంటలు వేస్తారో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే నాలుగు కేజీల బియ్యం కోసం తాము పోయే దినసరి కూలి పని కూడా వదులుకొని రోజంతా నిలబడాల్సి వస్తుందని కార్డుదారులు వాపోతున్నారన్నారు. ప్రతి స్టోర్‌లో 4, 5 రోజులకు మించి వేయడం లేదని, ఆతరువాత స్టాక్ అయిపోయిందని చెబుతున్నారని విమర్శించారు. ఎవరికీ పూర్తిగా రేషన్ బియ్యం అందడం లేదన్నారు. దీనివల్ల ప్రజలకు అందాల్సిన బియ్యం పక్క దారిన పడతున్నాయని అనుమానించాల్సి వస్తుందని, అధికారులు నిద్ర పోతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా, సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక రంజాన్ తోఫా లాంటివి ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. మరోవైపు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇంటి దగ్గరికి నిత్యవసర వస్తువులు సరఫరా చేసే వాహనాలను తొలగించారని దీనిపైన ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అదే రకంగా స్టోర్ లో కేవలం బియ్యం మాత్రమే కాకుండా పంచదార, పామాయిల్, కంది బేడలు లాంటి అన్ని రకాల సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. శ్రీ శ్రీనగర్, మహదేవ్ నగర్, గణే నాయక్ కాలనీ, కొడిమి పంచాయతీలోని ఆటో కాలనీ, జ్యోతి బసు కాలనీ, ప్రజా చైతన్య కాలనీలకు, కక్కలపల్లి పంచాయతీ పరిధిలో ప్రజాశక్తి నగర్‌లో చౌకదుకాణాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన అధికారులు తక్షణమే అన్ని స్టోర్ల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తామని, తనిఖీలు చేపడతామని, కొత్త స్టోర్లు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, గోపాల్, వలి, మసూద్, ఇర్ఫాన్, బుల్లె రాజు, ఎన్టీఆర్ శ్రీనివాసులు, వెంకటేశు, జీవ, నాయకులు నూరుల్లా, నల్లప్ప, శంకర, ప్రసాదు, రాఘవ, శంషాద్ తదితరులు పాల్గొన్నారు..

సంక్రాంతి కానుకలు అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ప్రజలందరికీ సంక్రాంతి కానుకలు అందజేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి పండగకూ కానుకలు అందిస్తామంటూ హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల తర్వాత పట్టించుకోలేదన్నారు. ఎండియు ఆపరేటర్లు కూడా సక్రమంగా పని చేయకపోయినా వారికి వేలకువేలు జీతాలు అందిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇంటింటికీ రేషన్ ఇవ్వడంతోపాటు సంక్రాంతి కానుకలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, సిఐటియు నాయకులు రమేష్, రాముడునాయక్, హరీష్, మస్తాన్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

వికలాంగులకు సబ్సిడీపై పెట్రోల్

వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.వినోద్

ప్రజాశక్తి-అనంతపురం

సొంత వ్యాపారం చేస్తున్నా, గుర్తింపు కలిగిన ప్రయివేట్ సంస్థల్లో పని చేస్తూ సొంత మూడు చక్రాల వాహనాలు కలిగిన దివ్యాంగుల వాహనాలకు సబ్సిడీపై పెట్రల్ అందజేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడిఎ బి.వినోద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్హత కలిగిన వికలాంగులు సబ్సిడీ పెట్రోల్ రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెట్రోల్ సబ్సిడీ కోసం దరఖాస్తుతోపాటు సదరం సర్టిఫికెట్, పెట్రోల్ బిల్లులు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, మూడు ఫొటోలు, మూడు చక్రాల వాహనం ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతోపాటు వ్యాపారం, సంస్థలో పని చేస్తున్న ధృవీకరణ పత్రాలతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మాతా, శిశు మరణాలను అరికట్టాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లావ్యాప్తంగా మాతా, శిశు మరణాలను తగ్గించాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. శుక్రవారం నగరంలోని కార్యాలయంలో గత రెండు నెలల్లో జరిగిన మాతా, శిశు మరణాలపై వైద్యసిబ్బందితో చర్చించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతాశిశు మరణాలు జరిగినప్పుడు వాటికి కారణాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం అలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, మత్తు మందు నిపుణులు నవీన్‌కుమార్, జిల్లా వ్యాధి నిరోధ టీకాల అధికారి యుగంధర్, సూపర్ వైస్సార్ బివి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

కమిషనర్ మల్లికార్జునరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారిణి

కమిషనర్‌గా వి.మల్లికార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎఫ్ఎసి కమిషనర్‌గా వి.మల్లికార్జున్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పరిపాలనాధికారిగా పని చేస్తున్న మల్లికార్జునరెడ్డిని నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి మలోల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మేనేజర్ లక్ష్మీదేవి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజుల కలిసి మల్లికార్జునరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇఇ రాధాకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నరసింహులు, వెంకటసుబ్బయ్య, సత్యనారాయణరెడ్డి, తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

వెయ్యి అరటి చెట్లు నరికివేత

రూ. 5 లక్షల నష్టం

ప్రజాశక్తి - పుట్లూరు

పుట్లూరు మండలంలోని కొండగారికుంట గ్రామంలో ఓ రైతుకు చెందిన వెయ్యి అరటి చెట్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు సుదర్శన్ నాయుడు అనే రైతుకు యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో 7 ఎకరాలు భూమి వుంది. అందులోని 3ఎకరాలలో 3,500 అరటి చెట్లు నాటారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వెయ్యి అరటి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. దీంతో బాధిత రైతుకు రూ. 5 లక్షల దాకా నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ సత్యబాబు శుక్రవారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ బాల రంగయ్య, చెవ్వ కుల శేఖర్ రెడ్డి, ఎల్ కె చిన్నారెడ్డి, గోవర్ధన్ రాజు, బ్రహ్మయ్య, రాముని రెడ్డి, విజయ్, ప్రసాద్, కంది కాపుల సర్పంచి శివరామయ్య, పుట్లూరు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు రవికుమార్ రెడ్డి బాధిత రైతును పరామర్శించారు.

అరటితోటను పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

చెట్లు నరికే సంస్కృతిని విడనాడాలి : చెట్లు నరికే విషసంస్కృతిని విడనాడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటి సభ్యులు ఆలం నరసానాయుడు, మాజీ ఎమ్మెల్యే యామిని బాల అన్నారు. ఈ మేరకు వారు వేర్వేరుగా బాధిత రైతు పొలాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కన్న బిడ్డల్లా పెంచుకున్న అరటి చెట్లను నరికి వేయడం చాలా దారుణమన్నారు. చెట్లు నరికే విషసంస్కృతిని విడనాడాలని ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అశోక్, బాలరంగయ్య, శ్రీరామరెడ్డి, శివశంకర రెడ్డి , జేఆర్ పేట బాబు, కోమటికుంట కులశేఖర్ రెడ్డి, పుట్లూరు మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికులకు కనీసవేతనం ఇవ్వాలి

సమ్మెకాలం ఒప్పందాలను అమలు చేయాలి : సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగిన రిలేదీక్షలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మున్సిపల్ కార్మికులు గతంలో నిర్వహించిన సమ్మెకాలంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంతోపాటు కనీస వేతనం రూ.21వేల వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ గతంలో కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు జీవోలు జారీ చేయాలన్నారు. ప్రధానంగా కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలని, దహన సంస్కారాలకు రూ.20వేలు ఇవ్వాలని, జీవో 36 ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శివ, నాయకులు తిమ్మప్ప, వెంకటేష్, రమణ, శివకుమార్, నటరాజ్, అలివేలమ్మ, లక్ష్మీదేవి, దుర్గమ్మ, యల్లక్క, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవో 36 ప్రకారం కనీసవేతనం రూ.21వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం రాయదుర్గంలో ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి పాత మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు సంబంధించిన జీవోలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాన్ని రానున్న తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వీరికి పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు మల్లేష్, స్వామి శీన, బొజ్జప్ప తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తిప్పేరుద్ర, రియాజ్, ఇస్మాయిల్, మైలారి, నరసింహులు, పాలయ్య, సిద్ద లింగ, రాము, తారా, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు సమ్మె పోరాట సందర్భంగా ఇచ్చిన హామీలకు జిఒలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జగదీష్ అధ్యక్షతన శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలు చేపట్టిన వారిలో హనుమంతు, గంగాధర్, లింగమూర్తి, పొన్నూరప్ప, హరి, నారాయణమ్మ, మరయమ్మ, జ్యోతి, తదితరులు ఉన్నారు.

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శుక్రవారం గుత్తిలో రిలే దీక్షలు చేపట్టారు. వీరికి సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజా, ఉపాధ్యక్షులు మురళి, రాజ్‌కుమార్, కార్యదర్శి రవి శంకర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు జి.ఓ నెం.36 ప్రకారం జీతాలు అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ సహాయ కార్యదర్శులు నరసింహులు, ఆదినారాయణ, కోశాధికారి నక్కా శేఖర్, పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు కె.సూర్య నారాయణ, కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, సహాయ కార్యదర్శులు కె.మహేష్, టి.సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

మోడీ మరోసారి 'మహా'మోసం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీలుపై రాష్ట్ర ప్రజల మనోభావాలను ఏమాత్రం గౌరవించకుండా మరోసారి మోసం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్న విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై ప్రధాని ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ప్రధాని తన సుదీర్ఘ ప్రసంగంలో ఆ రోజు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల గురించి గొప్పగా చెప్పారే తప్ప.. పదేళ్లుగా క్రితం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు, పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలపై మాట్లాడకుండా రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారన్నారు. విశాఖ ఉక్కును కాపాడి తీరుతామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం రద్దు, సొంత గనుల కేటాయింపు, సెయిల్ విలీనం సమస్యలపై ప్రధాని ప్రకటన చేస్తారని, రాష్ట్ర సిఎం, డిప్యూటీ సిఎం కలిసి ప్రకటన చేయిస్తారని ఎదురుచూసిన స్టీల్ కార్మికులు, విశాఖ ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. ప్రభుత్వాల మెడలు వంచి అయినా విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

హెచ్ఐవి నివారణకు కృషి చేద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

హెచ్ఐవి నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దామని రాకెట్ల పిహెచ్‌సి వైద్యాధికారి పావని పిలుపునిచ్చారు. శుక్రవారం ఎపి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆదేశాల మేరకు మండలంలోని పెద్దముష్టూరు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం హెచ్ఐవి పరీక్షలతోపాటు బిపి, షుగర్, హెచ్‌బి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పి రమేష్‌యాదవ్, సర్పంచు సుభాష్ చంద్రబోసు, సిహెచ్ఒ నాగరంగయ్య, సూపర్‌వైజర్ శేఖర్, ఎల్‌టి ఎస్తే రాణి, ఎఎన్ఎం,హేమలత, ఎంఎల్‌హెచ్‌పి హిమబిందు, ఎంపిహెచ్ఎ లింక్ వర్కర్లు నాగరాజు, నాగేంద్ర, శ్రీరాములు, దివ్య భారతి, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పామిడి

ప్రగతి నివేదికలను చదివి వినిపిస్తున్న వ్యవసాయ అధికారిని లీనా వసుంధర

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ముందుగా వ్యవసాయ శాఖ అధికారిణి లీనా వసుంధర ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం రామగిరి ఎంపిటిసి మజ్జిగ రాజశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో క్రాప్ బీమా రైతులతో కట్టించుకోలేదన్నారు. ఇప్పుడైతే వివిధ పంటలకు వివిధ రకాలుగా బీమా కట్టించుకున్నారన్నారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇందుకు వ్యవసాయ అధికారిణి స్పందిస్తూ ప్రస్తుత ప్రభుత్వ నిబంధనల ప్రకారమే క్రాప్ బీమాను రైతులతో కట్టించామన్నారు. అనంతరం ఆయా శాఖ అధికారులు వారి పరిధిలోని ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ తేజోష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బాలాజీనాయక్, మండల విద్యాధికారి జయానాయక్, వైస్‌ఎంపిపి కాయల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇఒఆర్‌డిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

విలేకరులపై దురుసుగా మాట్లాడిన ఇఒఆర్‌డిని వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సూరి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ బాలాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విలేకరులపై ఇఒఆర్‌డి జిలాన్‌బాషా దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇఒఆర్‌డిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, నాయకులు టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, జె.పెద్దయ్య, పుల్లయ్య, సుబ్బరాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటిద్దాం

రాయదుర్గం : దోమల ద్వారా వ్యాప్తించే మలేరియా, డెంగీ వంటి వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే పాటించాలని ఆరోగ్య విద్యా బోధకులు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 11వ వార్డు వడ్డే ఏరియాలో 'స్వచ్ఛ రాయదుర్గం-స్వస్త రాయదుర్గం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులోఉ భాగంగా ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమములో హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఆరోగ్య కార్యదర్శి ప్రమీల, సరోజ, నళిని, శోభ, ఆశావర్కర్లు శ్రీలత, పద్మావతి, యశోద, భాగ్యమ్మ, అంజీనమ్మ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పంపిణీ

వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న జడ్పిటిసి ప్రభావతమ్మ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలం పరిధిలోని నంజాపురం గ్రామంలో రైతులకు సబ్సిడీపై మజూరైన డ్రిప్ పరికరాలను మండల జడ్పిటిసి ప్రభావతమ్మ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడునెలల్లోనే సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ పరికరాలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంచిగారి శివారెడ్డి, శివ, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ నాగేంద్ర, అయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

నష్టపోయిన రైతులకు రూ.50వేల పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని సలకంచెరువు చెరువుకు నీరు అందించి చివరి ఆయకట్టు వరకూ నీరు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రీసర్వే చేసిన గ్రామాల్లో పాత పద్ధతిలోనే రైతుల భూములకు సంబంధించిన 1బి, అడంగళ్లు వచ్చేలా చూడాలన్నారు. హెచ్చెల్సీ ద్వారా మండలంలోని సలకంచెరువు చెరువుకు నీరు అందించి ఆయకట్టు చివరి వరకూ నీరు ఇవ్వాలన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు రూ.50వేలు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. రాచేపల్లి లెడ్‌క్యాప్ చెప్పుల తోళ్ల పరిశ్రమను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంతోపాటు కొత్తవారికి శిక్షణ ఇచ్చి బ్యాంకులో రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిదనవాడ గ్రామంలో దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. దళితులకు భూములు ఇవ్వాన్నారు. శింగనమల వరకూ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించాలని, రోడ్డు మరమ్మతులు చేయాలని, శింగనమల, తరిమెల ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటలు డాక్టర్లు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనారు. ఉల్లికల్లు గ్రామానికి ముంపు నష్ట పరిహారం చెల్లించాలని, గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు శ్రీనివాసులు, ఎర్రిస్వామి, సుంకన్న, కొండారెడ్డి, శ్రీనివాసులు, కుళ్లాయ్యస్వామి, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్, ఆంజనేయులు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

నూతన హంగులతో ఎగ్జిబిషన్

'ఎఫ్‌కె తాజ్ మహల్' నిర్వాహకులు ఫక్రుద్దీన్

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న రుత్విక్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ఫక్రుద్దీన్

ప్రజాశక్తి అనంతపురం

జిల్లా ప్రజల సౌకర్యార్థం జిల్లాలో మొట్టమొదటి సారిగా కనీవిని ఎరుగని రీతిలో భారీ సెట్టింగులు, నూతన హంగులతో ఎఫ్‌కె తాజ్‌మహల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు ఫక్రుద్దీన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని రుద్రంపేట బైపాస్ రోడ్డు, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పక్కన, సబ్ రిజిస్టర్ ఆఫీస్ దగ్గర ఏర్పాటు చేసిన ఎఫ్‌కె తాజ్‌మహల్ ఎగ్జిబిషన్‌ను రుత్విక్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ అనంతలో మునుపెన్నడూ లేనివిధంగా ఢిల్లీ ఎర్రకోట ముఖద్వారంతో సినిమా తరహాలో తాజ్‌మహల్ సెట్టింగ్‌తో ఎఫ్‌కె తాజ్‌మహల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని వయసుల వారికి అద్భుతమైన మధురానుభూతిని కలిగించే ఏర్పాట్లు చేశామన్నారు. అందరికీ వినోదం, ఆహ్లాదాన్ని అందించే అమ్యూజ్‌మెంట్, మహిళల కోసం ప్రత్యేకంగా వివిధ రాష్ట్రాల నుంచి గృహోపకరణాలు, కళానైపుణ్యం గల బెడ్ షీట్స్, హ్యాండి క్రాఫ్ట్, జ్యువెల్లరీ ఐటమ్స్, లేటెస్ట్ హ్యాండ్‌బ్యాగ్స్, రెడీ మేడ్స్ సరసమైన ధరలకు లభిస్తాయాని, ఢిల్లీ మసాలా అప్పడం, సిమ్లా బజ్జి, గోబీ మంచూరియ, పావ్ బాజీ, ఐస్ క్రీమ్స్, కూల్ డ్రింక్స్ తదితర రుచికరమైన తినుబండారాలు అందుబాటులో ఉంచామన్నారు. సాయంత్రం కొలంబస్, జెయింట్‌వీల్, క్రాస్ వీల్, రోలార్ కోస్టర్ వంటి అనేక రకాల ఎమ్యూజ్‌మెంట్ ఉంటుందన్నారు. రోజూ సాయంత్రం 5గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకూ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

ఎద్దులబండిపై వస్తున్న విద్యార్థులు, అనంతలక్ష్మి యాజమాన్యం

పట్టణంలోని ఇటుకుల పల్లిలో ఉన్న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన పాఠశాల ఛైర్మన్ అనంత రాముడు, వైస్‌ఛైర్మన్ రమేష్ మాట్లాడుతూ తెలుగు వారు ఎంతో వైభవంగా జరుపుకునే పండుగల్లో సంక్రాంతి ఒకటి అన్నారు. ఇది తెలుగుదనానికి ప్రతీక అన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో చిన్నారుల వేషధారణలు, డూడూ బసవన్నల చేత సన్నాయి మేళం, గంగిరెద్దుల ద్వారా సీతారాముల కళ్యాణం, తెలుగుదనం ఉట్టిపడేలా కోలాట నృత్యం, గురువయ్యల నృత్యం, గొబ్బెమ్మ పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఎఒ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా భోగి మంటలు వేశారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయ రామరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, అధ్యాపకులు జోష్న, శైలజ, శ్యామ్, రవి, చాముండేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు బుర్రకథ, హరిదాసు, పిట్టలదొర , శోదమ్మ వంటి సంప్రదాయ వేషధారణల్లో అలరించారు. ఈకార్యక్రమంలో సిఐ ఈరన్న, నీలకంఠ, ఆదినారాయణ, గుండా నారాయణ స్వామి, వెంకటస్వామి, విజన్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘంపై అవగాహన

యల్లనూరు : స్థానిక సహకార సొసైటీ కార్యాలయంలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐసిఎం కో ఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్ టి శ్రీనివాసులు, జిల్లా కో ఆపరేటివ్ అధికారిణి అరుణకుమారి మాట్లాడుతూ సహకార సంఘం తరపున రైతులకు అవసరమైన ఎరువులను సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. అలాగే సొసైటీ బ్యాంకును మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ అధికారి నాగరాజు, పిఎసి పర్సన్ ఇన్‌ఛార్జి వి.శ్రీనివాసులు, ఆర్‌వి కృష్ణారెడ్డి, ఎడిసిసి బ్యాంకు సిబ్బంది వెంకటకృష్ణయ్య, సొసైటీ సిఇఒ వీరనారప్ప, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

రాయదుర్గం పాలిటెక్నిక్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న లోకేష్

రాయదుర్గంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్ 2024-25 పోటీల్లో ప్రతిభ కనబరిచి మంత్రి నారా లోకేష్ ప్రశంసలు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. కళాశాల నుంచి ఎంపికైన రెండు ప్రాజెక్టులు నారా లోకేష్‌ను ఆకట్టుకున్నందున ప్రభుత్వం తరపున ఈ ప్రాజెక్టు ఐడియాలకు ప్రోత్సాహం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రాజెక్టుల రూపకల్పనకు ముఖ్య కారణమైన కళాశాల అధ్యాపకులు, ప్రాజెక్టు మెంటార్స్ ఎల్.హర్ష, అలీషా కలాం, షేక్ షబానాను అభినందించారు.

21న మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 21వతేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

బాలుడిని మింగిన క్వారీ గుంత

విద్యార్థి మృతితో తల్లడిల్లిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రసాద్ (పాతచిత్రం)

క్వారీ గుంతలో పడి విద్యార్థి మృతిచెందిన ఘటన మండలంలోని పసులూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పసులూరు గ్రామంలో నివసిస్తున్న దుబ్బన్నగారి ఓబులేసు, అంజినమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో మూడవ కుమారుడు ప్రసాద్ (11) గ్రామంలోనే 5వ తరగతి చదువుతున్నాడు. ముగ్గురు కలిసి వారి తోట సమీపంలో ఉన్న కమ్మ గుడ్డం కొండ దగ్గర కంకర తోలిన క్వారీ గుంత ఈతకు దిగారు. ఈత కొడుతుండగా ప్రసాద్ మునిగిపోయి ఊపిరాడక మృతిచెందాడు. తోటి సోదరులు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుమారుడి మృతదేహంపై పడి విలపించారు. సమాచారం అందుకున్న బుక్కరాయసముద్రం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎం.టెక్, బీ.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఎం.టెక్ 3వ సెమిస్టర్, రెగ్యులర్, సప్లిమెంటరీ, బి.ఫార్మసీ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, బి.ఫార్మసీ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్, 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్‌నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎపి శివకుమార్, అడిషనల్ కంట్రోలర్లు జి.శంకర్‌శేఖర్‌రాజు, ఎం.అంకారావు, ఎస్.శ్రీధర్ తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు.

28 మందికి ఉద్యోగాలు

రాయదుర్గం రూరల్ : స్థానిక ఎటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీడ్ యాప్ ట్రైనింగ్ దీపక్‌రెడ్డి, ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రఘురాంయాదవ్ తెలిపారు. అమెజాన్, ఫ్యూజన్ ఫైనాన్స్, హుండాయ్ మొబిస్, టెకన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, డిఆర్‌డిఎ, సీడాప్ డిపి ట్రైనర్ నారాయణస్వామి, ఎపి ఎస్ ఎస్ డి సి కో ఆర్డినేటర్ వనిత, రాము, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ బాల నరసింహులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై రైతులకు అవగాహన

పెద్దవడుగూరు : ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వేపై మండల పరిధిలోని దిమ్మగుడిలో అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 20 నుండి పట్టా భూములకు సంబంధించిన సర్వే జరుగుతుందన్నారు. రైతులు అందరూ సర్వే చేసే సమయంలో తప్పక వారి పాసు పుస్తకాలు, తగిన ఆధారాలు తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, సర్వే తహశీల్దార్ జయమ్మ, సర్వేయర్ ప్రసాద్, సర్పంచ్ రామచంద్రారెడ్డి, వీఆర్వోలు వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జడ్జి

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నహోబిలంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని జిల్లా స్పెషల్ కోర్టు జడ్జి కె.శివశంకర్ దంపతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ఇఒ రమేష్‌బాబు ఆలయ మర్యాదలతో జడ్జి దంపతులను ఆహ్వానించారు. తర్వాత వారిని సన్మానించి ఆలయ చరిత్రను వివరించారు.

ప్రత్యేక బస్సు నడపాలని వినతి

పామిడి : మండలంలోని కట్టకిందపల్లిలో ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న పెద్దమ్మ దేవర సందర్భంగా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండ డిపో ఆర్టీసీ డిఎం అప్పన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 11ఏళ్ల తర్వాత గ్రామంలో పెద్దమ్మ దేవర జరగబోతుందన్నారు. కావున ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు నడపాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆర్టీసీ డిఎం జనవరి 19 నుంచి 23వతేదీ వరకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుంకిరెడ్డి, వన్నూరు స్వామి, పెద్దరెడ్డి, పోతుల మధు, ఫీల్డ్ అసిస్టెంట్ సుమన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు కృషి

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని చేతి వృత్తిదారులకు ఉపాధి కల్పనతోపాటు ప్రజలకు మెరుగైన పౌరసేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని పట్టణ పేదరిక నిర్మూలన విభాగం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విశ్వజ్యోతి తెలిపారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కౌన్సిల్ హాలులో చేతి వృత్తి పనివారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం హోం ట్రయాంగిల్ ఆఫ్ వారితో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. హోం ట్రయాంగిల్ యాప్‌లో చేతి వృత్తి పనివారు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వంక పరిశుభ్రత

అనంతపురం : యూత్ ఎన్విరాన్‌మెంటల్ సర్వీస్ (ఎస్) ఆధ్వర్యంలో కూడేరు మండల కేంద్రంలోని వంకను శుభ్రం చేశారు. ఇందులో భాగంగా వంకలో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, సంచులు, చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ స్వచ్ఛంద సేవకులు సదాశివ, హరీష్, షణ్ముక్, అక్షయ్, నూర్, శివ చరణ్ పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాల్ : మండలంలోని గ్రామంలో నివాసం ఉంటున్న రైతు రామరాజుకు చెందిన పశుగ్రాసం శుక్రవారం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 20 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని వామిగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో పశుగ్రాసం మొత్తం అగ్నికి ఆహుతైందన్నారు. ఈ ప్రమాదాన్ని కారకులైన వారిని ప్రభుత్వం గుర్తించాలని గ్రామస్తులు కోరారు.

విశ్రాంత ఉద్యోగి సమయస్ఫూర్తి

ప్రజాశక్తి- అనంతపురం క్రైం

నారాయణరెడ్డిని సన్మానిస్తున్న టూటౌన్ సీఐ శ్రీకాంత్

నీవు క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావు.. నిన్ను తప్పించాలంటే రూ.30 లక్షలు డబ్బు ఇవ్వాలి' అని బెదిరించిన ఓ సైబర్ నేరగాన్ని నగరానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి ధైర్యంగా ఎదుర్కొన్న ఘటన అనంతపురంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావని, తప్పించాలంటే రూ.30 లక్షలు డబ్బు ఇవ్వాలంటూ సైబర్ నేరగాడు అనంతపురానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి నారాయణరెడ్డిని రెండ్రోజుల నుంచి ఫోన్‌లో బెదిరించాడు. ఇదంతా డబ్బు కాజేయడానికి సైబర్ నేరగాడు బెదిరిస్తున్నట్లు గుర్తించి ఎస్పీ పి.జగదీష్ కనుసన్నల్లో నడిచే సైబర్ పోలీస్ విభాగాన్ని సంప్రదించాడు. సైబర్ పోలీసులు నారాయణరెడ్డి వాయిస్ పూర్తిగా విన్నారు. ఆలస్యం చేయకుండా నారాయణరెడ్డిని టూటౌన్ సి.ఐ శ్రీకాంత్ వద్దకు తీసికెళ్లారు. అవతలి నుంచి రూ.30 లక్షల కోసం తరుచూ ఫోన్ చేస్తున్న సైబర్ నేరగాడితో సిఐ మాట్లాడారు. నీవు సైబర్ నేరగాడివని, ప్రజల్ని ఇలా సైబర్ ఫ్రాడ్స్‌కు గురి చేస్తే చట్టపరంగా కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని సిఐ మాట్లాడటంతో అవతల సైబర్ నేరగాడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో బాధితుడికి రూ.30 లక్షలు సేఫ్ అయ్యాయి. నారాయణరెడ్డిని ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. అంతేకాకుండా టూటౌన్ సిఐ శ్రీకాంత్, సైబర్ సెల్ సిఐ షేక్‌జాకీర్ అభినందిస్తూ శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సన్మానం చేశారు.

ఎడి కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

సాంకేతిక ఇబ్బందులను సవరించాలి

అనంతపురం : టిస్ నవీకరణలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను సవరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వకార్యదర్శి బి.నరసింహులు కోరారు. ఈమేరకు శుక్రవారం విద్యాశాఖ ఎడి కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, జిల్లా నాయకులు తిప్పేస్వామి, సుహేల్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఉరవకొండ : అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండుసెంట్లు ఇళ్లస్థలాలు ఇవ్వడంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ తాలూకా కార్యదర్శి జె.మల్లిఖార్జున డిమాండ్ చేశారు. శుక్ర వారం సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూడేరులోని తహాశీల్దార్ కార్యాలయం ముందు పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, వజ్రకరూరు మండల కార్యదర్శి సుల్తాన్, సీనియర్ నాయకులు రమణ, రమణప్ప, మలరాయుడు, వరప్రసాద్, ధనరాజ్, సహాయ కార్యదర్శి వెంకటేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

షేక్ ఫాతిమాకు నివాళి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమ జయంతి సందర్భంగా మైనారిటీ యువ నాయకులు బి ఎం నాదల్ ఆయన కార్యాలయంలో ఫాతిమా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 170 ఏండ్ల క్రితమే బడుగు, బలహీన వర్గాలకు, ప్రత్యేకంగా మహిళలకు విద్యా చాలా అవసరం గా భావించి ఆ దశగా ఉద్యమించిన మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతులతో కలిసి సామాజిక సేవకు నడుం గట్టిన మహనీయురాలు షేక్ ఫాతిమా అని తెలిపారు. పూలే దంపతులకు షేక్ ఫాతిమా ఆశ్రయమిచ్చి ఆదుకోవడం జరిగిందని అన్నారు. షేక్ ఫాతిమా కూడా లౌకిక విద్యను నేర్చుకొని సావిత్రిబాయి తో కలిసి విద్య బోధన చేసిన తొలి ముస్లిం ఉపాధ్యాయురాలుగా భారత ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. మైనారిటీల పేదరిక నిర్మూలన ఒక విద్యా ద్వారా మాత్రమే జరుగుతుందని బిఎం నాదల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఆర్ చౌదరి పాల్గొన్నారు.

యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి

ఉరవకొండ : స్వామి వివేకానంద జీవితం నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వక్తలు అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కరిబసవ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు వకృత్వం, వ్యాసరచన, భగవద్గీత, యోగాసనం, వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివాకర్, చంద్రశేఖర్, ఓబులేష్, శ్రీనివాసులు, శ్రీదేవి, శైలజ, చంద్రమోహన్, పృధ్వీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

'గోకులం' షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రభుత్వం పాడి రైతుల సౌకర్యార్థం మంజూరు చేసిన గోకులంషెడ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నరసింహారెడ్డి కోరారు. పల్లె పండుగలో భాగంగా శుక్రవారం పెద్దవడుగూరుతోపాటు రావులుడికి, గుత్తి అనంతపురం, అప్పేచెర్ల, మల్లేనిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మంజూరైన వాటిలో మొదటి విడత పూర్తి చేశామన్నారు. రెండోవిడతలో మంజూరైన వాటిని ప్రస్తుతం గ్రామాల వారీగా ప్రారంభించి రైతులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నవడుగూరు నారాయణరెడ్డి, గంగరాజు, సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజగోపాల్, ఉపాధి పథకం సహాయాధికారి పుల్లారెడ్డి, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు ఆత్మకూరు, ముట్టాల, గొరిదిండ్ల, పి.యాలేరు, సిద్ధరాంపురం, వడ్డుపల్లి, మదిగుబ్బ, సనప, బి.యాలేరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీనరసింహులు, ఎపిఒ సుజాత, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికారి ప్రతినిధి శశాంక్‌బాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, ఓబుళపతి, అక్కులప్ప, దాస్, ఆదెమ్మ, లింగన్న, వెంకటరామిరెడ్డి, తిమ్మరాజు, నాగభూషణ, చిన్నరాయుడు, ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాల్లో అధికారులు

గుత్తి : మండల వ్యాప్తంగా నూతనంగా నిర్మించిన పశువుల షెడ్లను అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా బసినేపల్లి గ్రామంలో డ్వామా పీడీ సలీంబాషా, శ్రీపురంలో ఎంపిడిఒ డి.ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈసీలు ఈశ్వర్‌రెడ్డి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : గోకులం షెడ్డును పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వజ్రకరూరు సర్పంచు మోనాలిసా కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోకులం షెడ్‌ను పాడి రైతులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి అధికారులు,రైతులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లను టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయకుమార్, ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామల శుక్రవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. అలాగే వెంకటాంపల్లి, బండ్లపల్లిలో ఎంపిడిఒ గంగావతి, సర్పంచి వెంకటనారాయణమ్మ, గూగూడులో సర్పంచు రమణకుమారి, ఎపిఒ ఎర్రమ్మ, పప్పూరులో ఎపిఒ రమేష్ రామారావు, నడింపల్లి, గుంజేపల్లి, శోదనపల్లి, కేసేపల్లిలో ప్రజాప్రతినిధులు గోకులంషెడ్లను ప్రారంభించారు.

శింగనమల మండలంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న అధికారులు

గుత్తి మండలంలో పశువుల షెడ్డు ప్రారంభిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

పుట్లూరు : మండలంలోని పుట్లూరు, గోపరాజుపల్లి, కొండగారికుంట, రంగరాజుకుంట, తదితర గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న మినీ గోకులం షెడ్లను ఎంపిడిఒ అలివేలమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శింగనమల : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో నిర్మించిన దాదాపు 24 మినీ గోకులం షెడ్లను అధికారులు ప్రారంభించారు. మండలంలోని శింగనమల, పెరవలి, నాయనవారిపల్లి, ఆకలేడు, ఉల్లికల్లు, వెస్ట్ నరసాపురం, చక్రాయపేట గ్రామ పంచాయతీలో రైతులు నిర్మించుకుని మినీ గోకులాలను తహాశీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపిడిఒ నిర్మలాకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి యోగేశ్వరి, ఇఒఆర్‌డి వెంకట లక్ష్మమ్మ, ఎపిఒ శ్రీదేవి, టిడిపి నాయకులు గుత్తా ఆదినారాయణ, మారుతీనాయుడు, సర్పంచి రాజు, పుచ్చకాయల రాము, జి.సత్యనారాయణ, ఎం.ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, కాయల రమణయాదవ్, మసూద్‌వలి, కాయగూర సత్తి, జడేజా, కాయల సురేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు జగన్‌కు అలవాటే..

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధ్యక్షుడు జగన్‌రెడ్డికి మొదటి నుంచి శవ రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి ఘటన విషయంలో జగన్‌తోపాటు ఆపార్టీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమన్నారు. ఘటనలో ఆరుగురు చనిపోవడం బాధాకరమన్నారు. ఘటన జరిగిన వెంటనే స్వయానా సిఎంతోపాటు డిప్యూటీ సిఎం తిరుపతికి చేరుకుని టిటిడి అధికారులు, పోలీస్ యంత్రాంగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారన్నారు. ఆఖరికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ క్షమాపణ కూడా చెప్పారన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే జగన్‌తోపాటు వైసిపి నాయకులంతా రాజకీయం చేసే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందా.. అని జగన్ 'గోతి కాడ నక్కలా' కాచుకుని కూర్చున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రమాదాల విషయంలో అయినా రాజకీయాలు చేయకుండా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి హితవు పలికారు.

నార్పల ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

కలెక్టర్ ఆదేశాల మేరకు నార్పల ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. గత సోమవారం శింగనమలలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు శుక్రవారం నార్పలకు వచ్చి బస్టాండ్ పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌ను పునరుద్ధరించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణమూర్తికి టిడిపి నేత ఆకుల విజయకుమార్ (బాబు) విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సలెహా, ప్రదీప్, ఇస్మాయిల్, రామాంజనేయులు, పవన్, లోకేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు ఆకుల బాబు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రభుత్వ వైఫల్యంతోనే తిరుపతి ఘటన

వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ వైఫల్యంతోనే తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతిచెందారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం అనంతపురంలోని 2వరోడ్డులో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా బుధవారం రాత్రి 11 గంటల సమయంలో భక్తాదులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి క్యూ లైన్ లో నిలబడి ఉంటే ఒక్కసారిగా పోలీసులు క్యూలైన్ వదలడంతో ఘటన జరిగిందన్నారు. ఈ ఘటలో ఆరుగురు మృతిచెందడంతోపాటు 40మంది భక్తులు గాయపడటం బాధాకమన్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

టిటిడిలో కలహాలే ఘటనకు కారణం

టిటిడి పాలకమండలిలో నెలకొన్న అంతర్గత కలహాలతోనే తిరుపతి ఘటన చోటు చేసుకుందని వైసిపి జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి ఘటన బాధాకరమన్నారు. ఘటనకు టిటిడి ఛైర్మన్, ఇఒ, ఇఒ, డిప్యూటీ ఇఒ మధ్య విభేదాల కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం రాజీనామా చేయాలి

హిందువుల మనోభావాలు దెబ్బతీసిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ వెంటనే పదవులకు రాజీనామా చేయాలని వైసిపి అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దైవ నిర్ణయం అనడం తప్పుదోవ పట్టించడమే అన్నారు. ముక్కుటి ఏకాదశికి లక్షల మంది భక్తులు వస్తారని తెలిసినా ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ఘటనకు బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్

వడ్డే ఓబన్న జయంతికి ఆహ్వానం

అనంతపురం రూరల్ : రేనాటి యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలకు హాజరు కావాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వడ్డెర సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే దగ్గుపాటి కార్యాలయంలో వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచపు వడ్డే వెంకటేశులు, టిడిపి నాయకులు వడ్డే సిమెంట్ పోలన్న, ముఖ్య నాయకులు కలిసి శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వడ్డే ఓబన్న జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానించారు.